జూబ్లీహిల్స్ టికెట్ యాదవులకే కేటాయించాలి

లాలాపేట: మాగంటి గోపీనాథ్ మరణంతో త్వరలో జరుగనున్న జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉపఎన్నికల్లో ఎమ్మెల్యేగా పోటీ చేసే అవకాశం దాదాపు 30 లక్షల జనాభా ఉన్న యాదవ సామాజికవర్గానికే ఇవ్వాలని రాష్ట్ర గొర్రెల, మేకల పెంపకం వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డా. కొమ్ము అశోక్‌యాదవ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... గతంలో ఇదే స్థానం నుంచి ఇండిపెండెంట్‌గా ఎంఐఎం నుంచి రెండు పర్యాయాలు పోటీ చేసి మెరుగైన ఓట్లు సాధించి ఇతర పార్టీ అభ్యర్థులకు గట్టి పోటీ ఇచ్చిన నవీన్ యాదవ్‌కు కాంగ్రెస్ పార్టీ టికెట్ ఇవ్వాలని సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. దీంతో పాటుగా కొన్ని సంవత్సరాల నుంచి అనేక సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తూ పేదలకు వెన్నుదన్నుగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. నవీన్‌యాదవ్‌కు అవకాశం ఇస్తే గొల్లకురుమలంతా ఏకమై ఆయనను గెలిపిస్తామనీ ధీమా వ్యక్తం చేశారు.

ప్రత్యేక పూజలు

అమీర్‌పేట: అమీర్‌పేట లక్ష్మీ దుర్గా సోనాబాయమ్మ వార్షికోత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. అమీర్‌పేట మాజీ కార్పొరేటర్ ఎన్.శేషుకుమారి, నాయకులు సత్యానారాయణ, అశోక్‌యాదవ్, హనుమంత్‌రావు, వనం శ్రీనివాస్ ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రక్తదాన శిబిరం



రాంగోపాల్‌పేట్: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్థాపించి 70 ఏళ్లు పూర్తయిన సందర్భంగా సికింద్రాబాద్‌లోని అడ్మినిస్ట్రేటివ్ కార్యాలయంలో సోమవారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బ్యాంకు డీజీఎం భువనేశ్వరి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆపదలో ఉన్న వారికి సరైన సమయంలో రక్తం అందక ప్రాణాలు పోతున్నాయని ప్రతి ఒక్కరు రక్తదానం తమ బాధ్యతగా భావించి అందించాలన్నారు. డాక్టర్ సునిల్‌చౌదరి, చీఫ్ మేనేజర్ (హెచ్‌ఆర్) కృష్ణారెడ్డి, ఆఫీసర్ల అసోసియేషన్ డీజీఎస్ సంతోష్, రాంబాబు పాల్గొన్నారు.

ఘనంగా ఉర్సు వేడుకలు



పద్మారావునగర్: సికింద్రాబాద్ బోట్స్‌క్లబ్ సమీపంలోని దర్గాలో సోమవారం 177వ ఉర్సు ఏ-షరీఫ్ హజ్రత్ సయ్యద్ షా సూఫి ఉర్సుల వేడుకలు ఘనంగా జరిగాయి. ఉర్సుకు హాజరైన మాజీ కార్పొరేటర్ అత్తెల్లి అరుణ శ్రీనివాస్ గౌడ్‌ను నిర్వాహకులు సత్కరించారు. అదే విధంగా ఆషుర్‌ఖానా బస్తీలో జరిగిన ఉర్సు ఏ-షరీఫ్ వేడుకల్లోనూ అరుణగౌడ్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మాజిత్, అరున్, యాకుబ్, రఫీ, అశ్వత్‌సయ్యద్, నూరు అశ్వియ సూఫి పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు ఆహ్వానం



అమీర్‌పేట: బల్కంపేట ఎల్లమ్మ అమ్మవారి కల్యాణ మహోత్సవం రోజున రేణుకా ఎల్లమ్మ సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించే అన్న ప్రసాద వితరణ కార్యక్రమానికి రావాలని సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను కోరారు. సేవా సమితి సభ్యులు సోమవారం అమీర్‌పేట మాజీ కార్పొరేటర్ ఎన్.శేషుకుమారితో కలిసి ఎమ్మెల్యేకు ఆహ్వాన పత్రికను అందజేశారు. జూలై 1న ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రసాద వితరణ చేయనున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో నగేష్, హనుమంత్ రావు, అశోక్‌యాదవ్, సంతోష్ మణికుమార్, వనం శ్రీనివాస్, సత్యానారాయణ, వెంకటేష్ యాదవ్,దుర్గా ప్రసాద్,బి.రమేష్ పాల్గొన్నారు.

వివాహితపై దాడిచేసి బంగారు ఆభరణాల దోపిడీ

అమీర్‌పేట: ఇంట్లోకి చొరబడ్డ ఓ వ్యక్తి వివాహితపై దాడిచేసి బంగారు ఆభరణాలు లాక్కెళ్లిన ఘటన ఎస్‌ఆర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం .. తులసీనగర్‌లో నివాసముంటున్న ఓ మహిళ (27)కు భర్త, ఇద్దరు పిల్లలు ఉన్నారు. భర్తతో విభేదాలు రావడంతో కొన్నాళ్లు దూరంగా ఉంది.ఆ సమయంలో దుర్గాప్రసాద్ అనే వ్యక్తి ఆమెకు పరిచయమయ్యాడు. అయితే భర్తతో వివాదాలు సమసిపోయి తిరిగి కలిసి కాపురం చేస్తున్నారు. పాత పరిచయంతో తన కోర్కె తీర్చాలని దుర్గాప్రసాద్ మహిళను వేధింపులకు గురిచేశాడు.ఈ నెల 20న భర్త ఇంట్లో లేని వేళ దుర్గాప్రసాద్ ఇంట్లోకి చొరబడి ఆమెపై దాడి చేసి బంగారు చైన్, ఉంగరాన్ని లాక్కుని వెళ్లాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

రహదారుల రక్షణకు ప్రత్యేక చర్యలు

- లష్కర్‌లో ప్రాంతాల వారీగా బాధ్యుల నియామకం
- సేఫ్టీ గ్రిల్స్ ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి
- జీహెచ్‌ఎంసీ నిర్ణయంపై హర్షం

సికింద్రాబాద్: సికింద్రాబాద్ సర్కిల్ పరిధిలోని రహదారుల రక్షణ కోసం జీహెచ్‌ఎంసీ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకునేందుకు సమాయత్తం అవుతున్నారు. లోగడ మాదిరి రహదారులను నిర్మించి వదిలివేయడం కాకుండా పెద్దమొత్తంలో నిధులు వెచ్చించి నిర్మించిన రహదారులను వరద కోతలు, ఇతరత్రా ప్రైవేటు వ్యక్తుల తవ్వకాల బారిన పడకుండా ఉండేందుకు, తక్షణ మరమ్మతు చర్యలు తీసుకునేందుకు కార్యాచరణ సిద్ధం చేపుకుంటున్నారు.

◆ కొద్దికాలంగా రహదారుల విస్తరణ, ఆధునీకరణ, జంక్షన్లలో ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. విద్యుత్, జలమండలి, ట్రాఫిక్ పోలీసులను సమన్వయం చేసుకుంటున్న జీహెచ్‌ఎంసీ అధికారులు కన్జర్వేషన్ సమావేశాలు నిర్వహిస్తూ రహదారులను ఆధునీకరిస్తున్నారు. ప్రత్యామ్నాయంగా స్వాంగ సుందరంగా తీర్చిదిద్దుకుంటున్న రహదారులను రక్షించుకునే కార్యక్రమాలు సిద్ధం చేసుకుంటున్నారు.

వర్షాకాలం నేపథ్యంలో.....

◆ ముంపు సందర్భాల్లో ఏర్పడే విపత్తులకు తక్షణ సహాయ చర్యలు తీసుకునే బాధ్యతలు హైడ్రా పరిధిలోకి వెళ్లాయి. ఇక సాధారణ వర్షాలు కురిసిన సందర్భాల్లో వరత ఉధృతికి గురయ్యే సందర్భాల్లో రహదారులపై గుంతలు పండడం, వరద కోతకు గురవడం జరిగినప్పుడు మాత్రం మరమ్మతులు చేయాల్సిన బాధ్యతలు జీహెచ్‌ఎంసీ అధికారుల పైనే ఉన్నాయి. ఇటువంటి సందర్భాల్లో రహదారుల పరిస్థితిని సకాలంలో గుర్తించి అవసరమైన మరమ్మతులు చేయించి ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకునేందుకు అవసరమైన ప్రణాళిక సిద్ధం చేసుకుంటున్నారు.

25 కిలో మీటర్ల రహదారులు...

◆ సికింద్రాబాద్ సర్కిల్ పరిధిలో పది ప్రధాన రహదారులు ఉన్నాయి. చిలకలగూడ చౌరస్తా, తార్నాక కూడలి, పార్శిగుట్ట రోడ్, జామై ఉస్మానియా, మెట్టుగూడ, నామాలగుండు, శాంతినగర్, ఆలుగడ్డబావి, ఆర్ట్స్ కళాశాల, వారాసీగూడ ప్రాంతాల్లోని సుమారు 25 కిలోమీటర్ల మేర పొడవు కలిగిన రహదారులను జాబితాలో చేర్చారు. ఈ దారులన్నీ జనం, వాహనాల రద్దీ ఎక్కువ కలిగిన ప్రాంతాలు కావడం గమనార్హం.

బాధ్యుల నియామకం....

◆ సర్కిల్ పరిధిలోని రహదారుల సంరక్షణ బాధ్యతలను మొత్తంగా జీహెచ్‌ఎంసీ ఇంజినీరింగ్ విభాగం అధికారులకు అప్పగిస్తున్నారు. ఆయా డివిజన్ల పరిధిలోని ఏఈలు, డీఈఈలు రోడ్ల సంరక్షణ బాధ్యులుగా కొనసాగనున్నారు. వీరిపై పర్యవేక్షణ వ్యవహారాలు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లకు అప్పగించనున్నారు. వర్షాకాలం అనంతరం కూడా రహదారులపై కంకరతేలడం, గుంతలు పడడం, రహదారులపై మురుగు, వరదనీరు నిల్వల సమస్యలు పరిష్కరించేందుకు బాధ్యులైన అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది.

సేఫ్టీగ్రిల్స్‌పై ప్రత్యేక పరిశీలన....

◆ సికింద్రాబాద్‌లోని పలు రహదారుల భూగర్భం నుంచి వరద, మురుగునీటి కాల్వలు ఉన్నాయి. వరదనీరు సాఫీగా బయటకు తరలివెళ్లడం కోసం రహదారుల మీద అధికారులు సేఫ్టీగ్రిల్స్‌ను ఏర్పాటు చేశారు. ఫలితంగా భారీవర్షాలు కురిసిన సందర్భంలో రహదారులపై వరదనీటి నిల్వలు లేకుండా సేఫ్టీ గ్రిల్స్‌తో సత్ఫలితాలు వస్తున్నాయి.



రహదారులపై ఏర్పాటు చేసిన సేఫ్టీ గ్రిల్

◆ పలు రహదారులకు ఆసాంతం సేఫ్టీగ్రిల్స్ ఏర్పాటు చేసిన ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించేందుకు అధికారులు నిర్ణయించారు. పలు ప్రాంతాల్లో మ్యాన్‌హోల్స్‌కి సైతం సేఫ్టీగ్రిల్స్ ఏర్పాటు చేశారు. అవి ధ్వంసం అయిన సందర్భాల్లో తక్షణ చర్యలు తీసుకుని వరద నిల్వలతోపాటు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలకు సిద్ధమవుతున్నారు.

సమాచారం అందించాలి

◆ రహదారులు వరదకోతకు గురైన సందర్భాల్లో ఆయా ప్రాంతాల ప్రజలకు సమాచారం అందించాలని జీహెచ్‌ఎంసీ అధికారులు కోరుతున్నారు. రహదారులు ప్రమాదకరంగా మారిన సమాచారాన్ని జీహెచ్‌ఎంసీ సర్కిల్ కార్యాలయం లేదా ఆయా డివిజన్ వార్డు కార్యాలయాల్లో ఫిర్యాదు చేయాలని చెబుతున్నారు. తమకు సమాచారం అందిన కొద్ది గంటల్లోనే మరమ్మతు చర్యలు తీసుకుని ప్రమాదక పరిస్థితులను దూరం చేసేందుకు చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇస్తున్నారు.

దేశ వ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలి

లాలాపేట: సెంట్రల్ ట్రేడ్ యూనియన్ పిలుపు మేరకు వచ్చే నెల 9 నుంచి దేశ వ్యాప్తంగా నిర్వహించతలపెట్టిన సమ్మెకు టీజీఎస్-ఆర్టీసీ బహుజన వర్కర్స్ యూనియన్ మద్దతు తెలియజేడంతో పాటు సమ్మెలో ప్రత్యక్షంగా పాల్గొంటుందని యూనియన్ ప్రధాన కార్యదర్శి సుద్దాల సురేష్ తెలిపారు. ఈ మేరకు ఆర్టీసీ ఎండీని సోమవారం కలిసి కార్మికుల డిమాండ్లపై వినతి పత్రంతో పాటు సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ... కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వ్యవహరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా జాయింట్ ప్లాట్‌ఫామ్ ఆఫ్ ట్రేడ్ యూనియన్స్ ఇచ్చిన పిలుపు మేరకు వచ్చే నెల 9 నుంచి చేపట్టనున్న సమ్మెలో పాల్గొనాలని బహుజన వర్కర్స్ యూనియన్ నిర్ణయించిందన్నారు. తెలంగాణలోని అన్ని ఆర్టీసీ డిపోలకు చెందిన కార్మికులంతా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

మాదకద్రవ్యాలపై వినియోగం.. అనర్థాలకు మూలం

బౌద్ధనగర్: మాదకద్రవ్యాలు వినియోగించడం వల్ల శరీరంతో మాటు మానసికంగా ఎన్నో దుష్ప్రభావాలను చూపిస్తుందని చిలకలగూడ ఏసీపీ శంకర్‌రెడ్డి అన్నారు. మాదవ ద్రవ్యాల వ్యతిరేక దిన వారోత్సవాల సందర్భంగా సోమవారం బౌద్ధనగర్‌లోని వారాసీగూడ పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఇన్‌స్పెక్టర్ మధుసూదన్‌రెడ్డి, ఎస్సై సునిత, పీస్ కమిటీ సభ్యులు శ్రీలత, సయ్యద్ ఖాలీద్ షా తదితరులతో కలిసి మొక్కలు నాటారు. అనంతరం డ్రగ్స్‌కు వ్యతిరేకగా చేపట్టిన ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇటీవల కాలంలో ముఖ్యంగా యువత వీటి బారినపడి విలువైన జీవితాన్ని పోగొట్టుకుంటున్నారని అన్నారు. డ్రగ్స్ వినియోగించడం, విక్రయించడం తీవ్రమైన నేరమని అన్నారు. ఎక్కడైనా దీనిని గుర్తిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ సమాచారాన్ని టోల్‌ఫ్రీ నంబర్ 1908, జాతీయ టోల్ ఫ్రీ నంబర్ 14446లకు సమాచారం అందించాలని సూచించారు. తెలంగాణ నుంచి డ్రగ్స్‌ను పారద్రోలేందుకు ప్రతి ఒక్కరూ ఒక సైనికుడిగా ముందుకు రావాలని కోరారు.

కరెన్సీపై బీఆర్ అంబేడ్కర్ ఫొటో ముద్రించాలి



మాట్లాడుతున్న ఆర్.కృష్ణయ్య

ఉస్మానియా యూనివర్సిటీ: కరెన్సీపై భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఫొటో ముద్రించాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. సోమవారం కరెన్సీ పై అంబేడ్కర్ ఫొటో సాధన సమితి ఆధ్వర్యంలో జరుగుతున్న లక్ష పోస్టు కార్డుల ఉద్యమం ఓయూలో ప్రారంభించారు. ఆర్ట్స్ కాలేజీ వద్ద సమితి జాతీయ అధ్యక్షుడు డా.జేరిపోతుల పరుశురామ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి రాజ్యాసభ సభ్యులు బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఆర్.కృష్ణయ్య హాజరై మాట్లాడారు. ఆర్‌బీఐ స్ఫూర్తిదాత డా.అంబేడ్కర్ ఫొటోను భారత కరెన్సీ పై ముద్రించాలని డిమాండ్ చేశారు. ఈ విషయాన్ని పార్లమెంట్‌లో మాట్లాడి ప్రధాని నరేంద్రమోదీ దృష్టికి తీసుకెళ్తానని ఆర్.కృష్ణయ్య తెలిపారు. పరుశురామ్ మాట్లాడుతూ జూన్ 23న (సోమవారం) ప్రారంభమై 2026 జనవరి 26 వరకు జరిగే ఈ కార్యక్రమానికి ప్రధాని మోదీని ఆహ్వానించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బెంజిమన్, చక్రాల రఘు, ఇటిక రాజు, మేరీ మాదిగ, మోజెస్, నేర్నాల కిశోర్, యాకన్న, మహేందర్, ఆశీర్వాదం తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి వినతి

అమీర్‌పేట: అమీర్‌పేట డివిజన్ బాపూనగర్‌లో నీటి సమస్యను పరిష్కరించడంతో పాటు డ్రైనేజీ లీకేజీలు అరికట్టాలని జీఎం ప్రభాకర్‌రావును సోమవారం బంజారా వెల్ఫేర్ అసోసియేషన్, సీనియర్ సిటిజన్స్ కలిసి వినతిపత్రం అందజేశారు. త్వరలోనే బాపూనగర్‌లో పర్యటించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని జీఎం హామీ ఇచ్చినట్లు బస్తీ అధ్యక్షులు హరిసింగ్ జాదవ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్ మధన్‌సింగ్, బాలు నాయక్, జగన్‌సింగ్,మోహన్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ కట్టడికి యువత ముందుకురావాలి

చిలకలగూడ ఏసీపీ శశాంక్‌రెడ్డి



చిలకలగూడ: డ్రగ్స్ కట్టడికి యువత ముందుకు రావాల్సిన సమయం ఆసన్నమైందని చిలకలగూడ ఏసీపీ శశాంక్‌రెడ్డి పిలుపునిచ్చారు. యాంటీ డ్రగ్స్ అవగాహన వారోత్సవాలను పురస్కరించుకుని చిలకలగూడ మున్సిపల్ మైదానంలో సోమవారం పలు చైతన్య, అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, ఫ్లకార్డులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఏసీపీ శశాంక్ రెడ్డి మాట్లాడుతూ.. డ్రగ్స్, మత్తుపదార్థాల సేవనం వలన కలిగే దుష్ప్రభావాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. డ్రగ్స్ మహమ్మారితో యువత భవిష్యత్‌కు పెనుముప్పు పొంచి ఉందన్నారు. యాంటీ డ్రగ్స్ అవగాహన వారోత్సవాల సందర్భంగా ఈనెల 26వ తేదీ వరకు ప్రతిరోజు పలు చైతన్య కార్యక్రమాలు నిర్వహించారు. ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించి అమలు చేస్తున్నట్లు వివరించారు. అనంతరం పీస్ కమిటీ సభ్యులతో కలిసి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో చిలకలగూడ ఎస్‌హెచ్‌ఓ అనుదీప్, డీఐ రమేష్‌గౌడ్, ఎస్ఐలు జ్ఞానేశ్వర్, ఆంజనేయులు, హముజానాయక్, సమీర్ సిబ్బంది పాల్గొన్నారు.

ఒలింపిక్ రన్



రసూల్‌పురా: అంతర్జాతీయ ఒలింపిక్ డే సందర్భంగా ఒలింపిక్ అసోసియేషన్ కంటోన్మెంట్ ఆధ్వర్యంలో సికింద్రాబాద్ జింఖానా మైదానం నుంచి ఎల్‌బీ స్టేడియం వరకు సోమవారం 39వ ఒలింపిక్ రన్ నిర్వహించారు. కంటోన్మెంట్ బోర్డు సీఈవో మధుకర్, కంటోన్మెంట్ స్పోర్ట్స్ అసోసియేషన్ చీఫ్ ప్యాట్రన్ జంపన ప్రతాప్ ముఖ్య అతిథులుగా హజరై ఒలింపిక్ జ్యోతి వెలిగించి జెండా ఊపి రన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా జంపన ప్రతాప్ మాట్లాడుతూ ఒలింపిక్ రన్ క్రీడాకారుల్లో స్ఫూర్తిని కలగజేస్తుందన్నారు. 39 ఏళ్లుగా కంటోన్మెంట్ నుంచి ఎల్‌బీస్టేడియం వరకు రన్ నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్రీడాభివృద్ధి అధికారి సుధాకర్, మాస్టర్స్ అథ్లెట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు మర్రి లక్ష్మణ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ప్రభు కుమార్ గౌడ్, సత్యనారాయణ, జగదీష్, జైరాజ్. వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్లకు మరమ్మతులు చేయించాలని వినతి

అడ్డగుట్ట: డివిజన్ పరిధిలో పాడైపోయిన రోడ్లన్నింటికీ మరమ్మతులు చేయించాలని జీహెచ్‌ఎంసీ జోనల్ కమిషనర్ రవికిరణ్‌ను బీజేపీ నేతలు కోరారు. ఈ మేరకు సోమవారం బీజేపీ డివిజన్ అధ్యక్షురాలు గాజుల సౌందర్య పార్టీ నేతలతో కలిసి వెళ్లి ఆయనకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సౌందర్య మాట్లాడుతూ.. జూన్ 2 రెండో తేదీన అడ్డగుట్ట డివిజన్లో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వాహించారని అన్నారు. అందులో స్థానికుల నుంచి రోడ్ల సమస్యలపై ఫిర్యాదులు వచ్చాయన్నారు. ఈ సందర్భంగా అడ్డగుట్ట సీ-సెక్షన్ నుంచి పహాడీ హనుమాన్ దేవాలయం వరకు నూతన సీసీ రోడ్డు, సాయి నగర్‌తో పాటు ఇతర బస్తీల్లో రోడ్ల మరమ్మతులు చేయాలని కోరుతూ జెడ్‌సీకి కేంద్రమంత్రి రాసిన లేఖను అందజేసినట్లు తెలిపారు. బోనాల పండుగను దృష్టిలో పెట్టుకుని డివిజన్లోని దేవాలయాల పరిసర ప్రాంతాల్లో కూడా రోడ్ల మరమ్మతు పనులు పూర్తి చేసి భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగాకుండా చూడాలని కోరారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సనత్‌నగర్: బోరబండ, బేగంపేట్, ఎస్పీఆర్, జనప్రియ సబ్ స్టేషన్ల పరిధిలోని ఫీడర్ల మరమ్మతుల కారణంగా సరఫరాలో అంతరాయం ఉంటుందని గ్రీన్‌ల్యాండ్స్ సీబీడీ ఏడీఈ చరణ్‌సింగ్ ఓ ప్రకటనలో తెలిపారు.

◆ ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు శరత్‌నగర్ ఫీడర్ పరిధిలోని శివాలయం, సారథినగర్, హెచ్‌ఎఫ్‌నగర్, హెచ్ ఎఫ్ నగర్ కమ్యూనిటీహాల్, సంజీవనగర్, శ్రీరాంనగర్, కార్మికనగర్ ప్రాంతాలు.

◆ ఉదయం 10 నుంచి 10.45 వరకు ప్లేగ్రౌండ్, డీకేరోడ్ ఫీడర్, పరిధిలోని శాంతిబాగ్, శివబాగ్, కేకేజోన్ హోటల్, శీషామహల్, ప్లేగ్రౌండ్, దివ్య శక్తి లేన్, డీకేరోడ్, రోశయ్య లేన్, శివబాగ్

◆ మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 వరకు కార్మికనగర్, బ్రహ్మశంకర్‌నగర్, బీఎస్‌పురి కాలనీ, సుల్తాన్‌నగర్, శంకర్‌లాల్‌నగర్, నట్రాజ్ నగర్, నేతాజీనగర్, శీషామహల్ ప్లేగ్రౌండ్, దివ్య శక్తి లేన్, గ్రీన్‌పార్క్, డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్ ప్రాంతాల్లో విద్యుత్ ఉండదన్నారు.

రాంగోపాల్‌పేట్: ఉస్మానియా యూనివర్సిటీ సబ్‌స్టేషన్ పరిధిలోని ఫీడర్ల మరమ్మతుల కారణంగా సరఫరాలో అంతరాయం ఉంటుందని ప్యారడైజ్ సబ్‌డివిజన్ సీబీడీ ఏడీఈ ఆదినారాయణరావు ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు మెట్టుగూడ ఫీడర్ పరిధిలోని మెట్టుగూడ పార్కు రైల్వే క్లబ్, బీఎస్‌ఎన్‌ఎల్ ఎక్స్ఛేంజ్, అశోక లైబ్రరీ, బొందలగడ్డ, కృపా అపార్ట్‌మెంట్, స్కైలాబ్ ప్రాంతాలు. మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5 వరకు రవీంద్రనగర్ ఫీడర్ పరిధిలోని రవీంద్రనగర్, మోడల్ స్కూల్ పీటీ, ధోబిఘాట్, ఈఎఫ్‌ఎల్ వెనుక, మాణికేశ్వరీనగర్ ప్రాంతాల్లో విద్యుత్ ఉండదన్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్ షురూ

బౌద్ధనగర్: పార్శిగుట్టలోని శ్మశాన వాటిక వద్ద బౌద్ధనగర్ కార్పొరేటర్ కంది శైలజ శ్రీకాంత్ ఆధ్వర్యంలో స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... మన చుట్టూ పక్కల ఉన్న పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకోవడం చాలా ముఖ్యమని అన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే వ్యాధులు కూడా ప్రబలకుండా ఉంటాయని చెప్పారు.

బీఆర్‌ఎస్ బలోపేతానికి సంఘటితంగా ముందుకు సాగాలి



అడ్డగుట్ట: డివిజన్‌లో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కార్యకర్తలందరూ సంఘటితంగా ముందుకు సాగాలని బీఆర్‌ఎస్ యువజన నాయకుడు రామేశ్వర్‌గౌడ్ సూచించారు. సోమవారం అడ్డగుట్టలో బీఆర్‌ఎస్ ముఖ్య నేతల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన రామేశ్వర్‌గౌడ్ మాట్లాడుతూ... ప్రజా సమస్యలు ఎప్పటికప్పుడు తెలుసుకొని వాటిని పరిష్కరించే విధంగా స్థానిక నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు. డివిజన్‌లో పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా సైనికుల్లా పని చేయాలని పిలుపునిచ్చారు. స్థానిక ఎమ్మెల్యే పద్మారావుగౌడ్ చొరవతో ఎప్పటికప్పుడు డివిజన్‌ను అభివృద్ధి పథంలో ఉంచే విధంగా ప్రయత్నించాలని అన్నారు. ఈ సమావేశంలో బీఆర్‌ఎస్ నేతలు నక్క మధు, లింగాని శ్రీనివాస్, శ్రీనివాస్‌గౌడ్, వసంత, ప్రవీణ్, దాసరి శ్రీను, మహ్మద్, అమర్, రామప్ప, చంద్రశేఖర్, రమాదేవి, రమేష్, మహేందర్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

జూలైలో విద్యాసంస్థల 48 గంటల బంద్

ఉస్మానియా యూనివర్సిటీ: జూలై మొదటి వారంలో విద్యా సంస్థల 48 గంటల బంద్‌కు జార్జిరెడ్డి పీడీఎస్‌యూ నాయకులు పిలుపునిచ్చారు. సోమవారం ఓయూలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ... జూలై 3, 4న ఇంజినీరింగ్, డిగ్రీ, పీజీ కోర్సుల కళాశాలతో పాటు వృత్తివిద్య కాలేజీలను రెండు రోజులు బంద్ చేయనున్నట్లు రాష్ట్ర అధ్యక్షుడు డా.ఎస్ నాగేశ్వర్‌రావు, ప్రధాన కార్యదర్శి సుమంత్, రాష్ట్ర గర్ల్స్ కన్వీనర్ స్వాతి పేర్కొన్నారు. రూ.8000 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలతో పాటు ఫీజుల పెంపు, ఇతర విద్య రంగ సమస్యల పరిష్కారం కోసం జరిగే 48 గంటల బంద్‌కు విద్యార్థులు, విద్యా సంస్థల నిర్వహకులు సహకరించాలని కోరారు.

బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయండి

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్రంలో ఖాళీగా ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాలని ఓయూ విద్యార్థి నేతలు మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ను కోరారు. సోమవారం మంత్రి నివాసంలో కలసిన ఓయూ విద్యార్థి నేతలు ఆయన్ను ఘనంగా సన్మానించారు. మాదిగ సామాజిక వర్గానికి చెందిన ఎమ్మెల్యేలకు మంత్రివర్గంలో చోటు కల్పించాలని గతంలో అనేక ఆందోళన కార్యక్రమాలు చేపట్టిన్నట్లు మంత్రికి వివరించిన్నట్లు చెప్పారు. కార్యక్రమంలో బహుజన విద్యార్థి సంఘాల జేఏసీ చైర్మన్ వేల్పుల సంజయ్, తెలంగాణ ఎస్సీ, ఎస్టీ విద్యార్థి సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు పెంట కృష్ణ, అభి, ప్రకాష్, శివ పాల్గొన్నారు.

వీధి వ్యాపారులకు బాసటగా ఎమ్మెల్యే



వీధి వ్యాపారుల సమస్యలను అడిగి తెలుసుకున్న ఎమ్మెల్యే శ్రీ గణేష్

బొల్లారం: సికింద్రాబాద్ కంటోన్మెంట్ 7 వ వార్డ్ పరిధిలోని లాల్ బజార్ ప్రాంతంలో గత 20 ఏళ్లుగా జీవనాధారంగా వ్యాపారం చేస్తున్న వీధి వ్యాపారులను ట్రాఫిక్ పోలీసులు తొలగించే ప్రయత్నం చేయడంతో, తమను అక్కడి నుంచి తరలించవద్దని కోరుతూ వారు ఎమ్మెల్యే శ్రీ గణేష్‌ను కలిసి తమ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే లాల్ బజార్‌కు వచ్చి వ్యాపారులను పరామర్శించి, ఉన్నతాధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. ''ఇది వారి జీవనాధారం, దయచేసి మానవతా దృష్టితో చూడాలి''అంటూ అధికారులను అభ్యర్థించారు. అలాగే లాల్ బజార్ షాపింగ్ కాంప్లెక్స్‌లో అద్దె ఎక్కువగా ఉండటంతో చిరు వ్యాపారులు ఇబ్బంది పడుతున్నట్టు తెలిపారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే, కంటోన్మెంట్ బోర్డు సీఈవోతో మాట్లాడి, తక్కువ అద్దెతో షాపులు ఇవ్వాలని సూచించారు.

ఆలయాభివృద్ధికి పాటుపడాలి: ఎమ్మెల్యే

కంటోన్మెంట్: పాలక మండలి సభ్యులు ఆలయాల అభివృద్ధికి కృషి చేయాలని ఎమ్మెల్యే శ్రీగణేష్ అన్నారు. నాలుగో వార్డు లక్ష్మీనగర్‌లోని హనుమాన్ దేవాలయ నూతన కమిటీ సభ్యులు సోమవారం ఎమ్మెల్యే శ్రీగణేశ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి, తమ ఎంపికకు సహకరించినందుకు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ఆలయంలో భక్తులకు మౌలిక సదుపాయాలు మెరుగుపరచాలన్నారు. ప్రభుత్వం తరపున అవసమైన సహకారాన్ని అందిస్తానన్నారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో దేవాలయ కమిటీ చైర్మన్ చైర్మన్ దర్శనాల సాంబశివ, సభ్యులు కరణం సంధ్యారాణి, నల్లోల్ల శివానంద్, యాప్రాల కార్తీక్, దుద్దు రామకృష్ణ, వల్లూరు బద్రీనాథ్ తదితరులున్నారు.

శ్యామాప్రసాద్ ముఖర్జీ సేవలు మరువలేనివి

కంటోన్మెంట్: జాతీయ సమైక్యతో విశేష కృషి చేసిన దివంగత నేత శ్యామాప్రసాద్ ముఖర్జీ సేవలు మరువలేనివని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షులు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జే. రామకృష్ణ (ఆర్‌కే) అన్నారు. శ్యామాప్రసాద్ ముఖర్జీ వర్ధంతిని పురస్కరించుకుని బీజేపీతో నేతలతో కలిసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఒకే దేశంలో రెండు రాజ్యాంగాలు, ఇద్దరు ప్రధానమంత్రులు, రెండు జాతీయ పతాకాలు ఉండటాన్ని సహించలేమని నినదించిన యోధుడని అన్నారు. ఆర్టికల్ 370 రద్దు కోసం ఆనాడే పోరాటం చేశారన్నారు. ఆయన ఆశయాలను బీజేపీ నెరవేరుస్తుందని అన్నారు.

ఘనంగా బలిదాన్ దివస్

చిలకలగూడ: బలిదాన్ దివస్‌ను పురస్కరించుకుని పలువురు బీజేపీ నాయకులు చిలకలగూడ మున్సిపల్ మైదానంలో జనసంఘ్ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యామాప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన ఆశలు, ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం సీతాఫల్‌మండి రామాలయం వద్ద మొక్కలు నాటారు.



బౌద్ధనగర్ డివిజన్‌లో..



కంటోన్మెంట్‌లో...

శ్యామా ప్రసాద్ ముఖర్జీ ఆశయాలతో పని చేస్తాం...

బౌద్ధనగర్: భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకులు డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి (బలిదాన్ దివస్) సందర్భంగా బౌద్ధనగర్ డివిజన్‌లో ఏర్పాటు చేసిన చిత్రపటానికి బీజేపీ నాయకులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవి ప్రసాద్‌గౌడ్ మాట్లాడుతూ... శ్యామాప్రసాద్ ముఖర్జీ ఆశయాల కనుగుణంగా పనిచేస్తామని తెలిపారు. సాంస్కృతిక, ఆరిక జాతీయవాదమే పునాదిగా భారతీయ సనాతన ధర్మరక్షణే ధ్యేయంగా భారతీయ జన సంఘ్‌న స్థాపించిన మార్గదర్శి ముఖర్జీ అని పేర్కొన్నారు. 'ఏక్ దేశ్ మే దో విధాన్, దో ప్రధాన్, దో నిశాన్ నహి చలేగా'అని నినదించిన ధైర్యశాలి అని అన్నారు.

శ్యామప్రసాద్ ముఖర్జీకి నివాళి

బన్సీలాల్‌పేట్: బన్సీలాల్‌పేట్ డివిజన్ పద్మారావు నగర్‌లో సోమవారం జనసంఘ్ వ్యవస్థాపకులు శ్యామ ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు శ్యామ ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలేసి నివాళులర్పించారు.



సీతాఫల్‌మండి రామాలయం వద్ద..